


బాధ్యతలు చేపట్టిన డిఇఒ లింగేశ్వర రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా విద్యా శాఖ అధికారిగా బి.లింగేశ్వరరెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పూర్తి అదనపు బాధ్యతల్లో ఉన్న ఎడి వెంకటేశ్వరరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యూటీ డిఇఒగా లింగేశ్వరరెడ్డి పనిచేశారు. ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఎడి వెంకటేశ్వరరావు, ఎంఇఒ, ప్రధానోపాధ్యాయులు, విద్యా శాఖ, సమగ్ర శిక్ష కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం లింగేశ్వరరెడ్డి జెడ్‌పి చైర్మన్ ఎం.శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలిశారు.



జెడ్‌పి చైర్మన్‌ను కలిసిన డిఇఒ లింగేశ్వరరెడ్డి



నిర్మాణాలు పూర్తికాని గుంకలాంలోని జగనన్న లే అవుట్

నత్తనడకన గృహ నిర్మాణం

ఆర్థిక ఇబ్బందులు, మౌలిక సదుపాయాల లేమే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహ నిర్మాణం విజయనగరం జిల్లాలో నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1.80లక్షలు ఎటూ చాలకపోవడం, పెరిగిన గృహ నిర్మాణ సామగ్రి ధరలు, లేఅవుట్లలో మౌలిక సదుపాయాల లేమి ఇందుకు కారణం. జిల్లా వ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో 37, 101, సొంత స్థలాల్లో 41,057మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో 29వేల ఇళ్లను డిసెంబర్ 21న సామూహిక గృహ ప్రవేశాలకు అనుగుణంగా పనులు వేగవంతం చేస్తామని ప్రభుత్వం చెప్తున్న విషయం విధితమే. ఆచరణలో గృహ నిర్మాణదారులకు అన్నీ ఆటంకాలే కనిపిస్తున్నాయి. వేపాడ మండలం వల్లంపూడి జగనన్న లేఅవుట్‌లో 28మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. వీరిలో 22 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించినా పూర్తి కాలేదు. ఆరుగురు ఆర్థిక ఇబ్బందుల వల్ల అసలు ముందుకు రాలేదు. ఇప్పటి వరకు స్లాబ్ లెవెల్‌కు వచ్చినవి అక్షరాలా ఆరు మాత్రమే. మిగిలినవారంతా పునాదులు, గోడల దశలో నిర్మాణాలు నిలిపివేశారు. లేఅవుట్ అంతా లోతట్టు ప్రాంతంలోవుండడం వల్ల చుట్టూ నీరు చేరిందని, దీనికితోడు మెటీరియల్ తెచ్చుకోవడానికి కనీసం రహదారి కూడా లేకపోవడం వల్ల కట్టుకోలేకపోతున్నామని కాస్త ఆర్థికంగా అవకాశం ఉన్నవారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగరంలోని పేదలకు సుమారు 10కిలోమీటర్ల దూరంలోగల గుంకలాంలో సుమారు 394 ఎకరాల్లో 12,216మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఇది రాష్ట్రంలోనే అతిపెద్ద రెండో లేఅవుట్. దీన్ని 2020 డిసెంబర్ 30న సాక్షాత్తు సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. నీటిసదుపాయం, రోడ్లు, సైల్ లెవిలింగ్, రెండు, సిమెంట్ గోడౌన్ల నిర్మాణం, విద్యుత్ సదుపాయం పేరిట ప్రభుత్వం నుంచి రూ.1.13కోట్లు మంజూరు కాగా, సుమారు రూ.కోటి విలువైన పనులు జరిగిపోయినట్టు అధికారులు లెక్కలు చూపిస్తున్నారు. కానీ, సదుపాయాలు అంతలా కనిపించకపోవడంతో లబ్ధిదారులకు నమ్మకం కుదరడం లేదు. దీనికితోడు ఇక్కడి లబ్దిదారుల్లో ఎక్కువ మంది పేదలు ఉండడం వల్ల ఇప్పటి వరకు కేవలం 22ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. ఇళ్లు నిర్మించుకోకపోతే స్థలాలు వెనక్కి తీసుకుంటామని బెదిరిస్తున్నప్పటికీ సుమారు 7వేల ఇళ్లు పునాదులు పూర్తికాకుండానే నిలిచిపోయాయి. పునాదుల స్థాయిలో మరో 1500 వరకు ఉన్నాయి. స్లాబ్ పూర్తిచేసినవి 81మాత్రమే. స్థలాలు లాక్కుంటారని బెదిరించడంతో ఇంటి నిర్మాణం ప్రారంభించామని, తీరా పునాదులకే చేతిలోవున్న రూ.50వేలు సరిపోకపోవడంతో ముందుకు సాగలేకపోయామని గోకపేటకు చెందిన ఆర్.పైడమ్మ ఆవేదన వ్యక్తం చేస్తోంది. పట్టణానికి చాలా దూరంలో ఉండడం వల్ల ప్రధాన రహదారి, బస్సు సదుపాయం, నివాసయోగ్యానికి అనుగుణంగా లేఅవుట్‌లో రోడ్లు, కాలువలు, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తే తప్ప ఇల్లు కట్టుకునేందుకు సాహసించలేమని ఎక్కువ మంది చెబుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, కొందరు, ప్రభుత్వం ఇస్తున్న రూ.1.80 లక్షలు ఏమూలకూ సరిపోవని మరికొందరు, ఇసుక దొరకడం లేదని ఇంకొందరు చెబుతున్నారు. ఇలా జిల్లాలో ఏ లేఅవుట్‌ను పరిశీలించినా, వ్యక్తిగత స్థలాల్లో చేపట్టిన ఇళ్లను పరిశీలించినా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా మొత్తంగా ఇప్పటి వరకు కేవలం 13,938ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి. వచ్చే డిసెంబర్ నాటికి లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు పూర్తికావాలని అధికారులపై ప్రభుత్వం ఒత్తిడి చేయడంతో ఆ ప్రభావం లబ్ధిదారులపై పడుతోంది. అయినప్పటికీ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

ప్రభుత్వం ఇస్తున్న డబ్బులతో ఇల్లు పూర్తి చేయలేం



ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.లక్షా 80వేలతో ఇల్లు పూర్తయ్యే పరిస్థితి లేదు. ఇసుక, సిమెంట్, ఇటుక,రాయి ధరలు బాగా పెరిగాయి. కనీసం రూ.6లక్షలు ఉంటేగాని ఇంటి నిర్మాణం పూర్తి కాదని తాపీమేస్త్రీలు చెబుతున్నారు. అందుకే ప్రభుత్వం ఇల్లు మంజూరుచేసినా సాహసించలేకపోతున్నాం.

- పి.సునీత, పూసపాటిరేగ

చాగంటికి గురజాడ పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం కోట



చాగంటి కోటేశ్వరరావు

2022 సంవత్సరానికి గాను గురజాడ విశిష్ట పురస్కారం చాగంటి కోటేశ్వరరావు ఇవ్వనున్నట్లు గురజాడ సాంస్కృతిక సమైక్య అధ్యక్షులు పివి నరసింహారావు, ప్రధాన కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ తెలిపారు. గురువారం మహాకవి గురజాడ స్వగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఏటా నవంబరు 30న ఉదయం నుంచి రాత్రి వరకు 'గురజాడ సాహితీ చైతన్యోత్సవం' నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా సాంస్కృతిక రంగానికి చెందిన ప్రముఖులను గురజాడ విశిష్ట పురస్కారంతో గౌరవించు కోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.

ఇప్పటివరకు ఈ పురస్కారంతో జెవి సోమయాజులు, గొల్లపూడి మారుతీరావు, డాక్టర్ సి.నారాయణ రెడ్డి, కె.విశ్వనాథ్, గుమ్మడి, షావుకారు జానకి, మల్లెమాల, అంజలిదేవి, రావి కొండలరావు, వంశీ, భరణి, చాట్ల, మొదిలి నాగభూషణ శర్మ, సుద్దాల, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మి ప్రసాద్, గరికపాటి నరశింహారావు, డాక్టర్ ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం, డైరెక్టర్ క్రిష్, గేయరచయిత రామజోగయ్యశాస్త్రి సత్కరించుకున్నామని తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఉత్తరాంధ్ర రచయితలకు నిర్వహించిన కవితల పోటీ విజేతల స్వీయ కవితా పఠనం, బహుమతి ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి డాక్టర్ గోపాలరావు, గురజాడ అప్పారావు మునిమనవడు ప్రసాద్, ఇందిరా, జక్కు రామకృష్ణ, చక్రవర్తి పాల్గొన్నారు.

పులి దాడిలో ఆవు మృతి

ప్రజాశక్తి-దత్తిరాజేరు



పులిదాడిలో మృతిచెందిన ఆవు

మండలంలోని భూపాలరాజపురంలో ఆవుపై పులిదాడి చేసి చంపేసిన సంఘటన గురు వారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. రైతు గెద్ద తిరుపతి రావుకు చెందిన ఈ ఆవు పశు వుల శాలలో కట్టి ఉండగా, రాత్రివేళ పులి దాడి చేసింది. దీనివిలువ సుమారు రూ.30వేలు ఉంటుందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తులు అటవీ శాఖ అధికారులుకు తెలియజేయగా సంఘటన స్థలానికి చేరుకొని పులి దాడి యేనని నిర్ధారించారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ ఘటనతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

విద్యుదాఘాతంతో డిగ్రీ విద్యార్థి మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి



ఉదయ్‌కిరణ్ (ఫైల్)

విద్యుత్ షాక్‌తో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న కిలపర్తి ఉదయ్ కిరణ్ (19)మృతి చెందాడు మండలంలోని జె. రంగరాయపురం గ్రామానికి చెందిన ఉదయ్ కిరణ్ బుధవారం రాత్రి కొబ్బరి కాయలు తెంపేందుకు కొబ్బరి చెట్టు ఎక్కాడు. చెట్టు సమీపంలో విద్యుత్ వైర్లు ఉండటాన్ని గమనించకపోవడంతో చెట్టు ఎక్కుతున్న సమయంలో విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మరణించాడు. ఉదయ్ కిరణ్ బొబ్బిలి శ్రీసాయి డిగ్రీ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు పిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎంఇఒ సంతకం ఫోర్జరీ

ఉపాధ్యాయుడు శంకర్‌గిరి నాయుడుకు మెమో జారీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన చేతులతో తన వ్యక్తిగత ప్రయోజనాలు కోసం మండల విద్యాశాఖ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి అధికారులను ఓ ఉపాధ్యాయుడు మస్కా కొట్టించిన ఘటన గంట్యాడ మండలంలో చోటుచేసుకుంది. సిరిపురం ఎంపి యుపి స్కూల్లో తెలుగు పండిట్‌గా పని చేస్తున్న వై.శంకర్ గిరినాయుడు మెడికల్ బిల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. దాన్ని పరిశీలించి సంతకం చేసి పై అధికారులకు ఎంఇఒ పంపుతారు. కానీ ఎంఇఒకు తెలియకుండానే ముందుగానే మెడికల్ బిల్లుపై సంతకం చేసి ఉండటంతో దరఖాస్తును పరిశీలించిన ఎంఇఒ అవాక్కు అయ్యారు. దీనిపై ఆరా తీసిన ఎంఇఒ విజయలక్ష్మి ఆ ఉపాధ్యాయుడికి మెమో జారీ చేశారు. విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు ఓ గెజిటెడ్ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేయడం క్రిమినల్ చర్య కిందకు వస్తుంది. అయితే ఎంఇఒపై కొంతమంది నాయకుల ఒత్తిడి ఉండంతో మెమో మాత్రమే జారీ చేశారని ఉపాధ్యాయుల్లో చర్చ జరుగుతోంది.

ఎంఇఒ సంతకాన్ని ఫోర్జరీ చేసిన ఆ ఉపాధ్యాయుడు ఇదంతా నెట్ సెంటర్ వాడు చేశాడని అధికారులను తప్పుతోవ పట్టిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కొద్దిరోజుల క్రితం యుటిఎఫ్ నాయకులు డిఇఒకు వినతినిచ్చారు.



MEDICAL REIMBURSEMENT FORM

Employee Details

Emp Type:Employee | Emp Id:0242267 | Name:SANKARA GIRI NAIDU
Email: | Mobile Number:9492545632 | Employee Designation:SA Telugu

Address Details

Residential Address:
House No:PLOT NO 173 REVENUE COLONY | Street No:SRINIVASAM GROUP HOUSEKUKALAMETTA LAKSHMIPURAM | State:Andhra Pradesh
District:VIZIANAGARAM | Villages/Cities/Towns:VIZIANAGARAM MUNICIPALI

Office Address:
House No:NEAR MAIN ROAD | Street No:BESIDE MPDO OFFICEGANTYADA | State:Andhra Pradesh
District:VIZIANAGARAM | Villages/Cities/Towns:GANTYADA

Employee Pay Details

Pay Source:GOAP PRC | PRC:2010 | Current Pay:14050

POSTING DETAILS

HOD Name:Director School Education | DDO Code:MEO GANTYADA(22010308003) | District:VIZIANAGARAM

Last Posting Details

HOD:Director School Education | Last Posted State:Andhra Pradesh | Last Posted District:
Pay Source:GOAP PRC | PRC:2010

Pension Office Details

Pension Office State: | Pension Office District: | STO Office unit:

Treatment Details

Treatments For:YENDUVA SANKARA GIRI NAIDU | Patient Name:YENDUVA SANKARA GIRI NAIDU | Patient Gender:M
Patient Date Of Birth:03/06/1971 | Age:51 | Relation With Employee:Self
Is Hypertensive: N | Is Diabetic: Y | Patient Type: IP
Date Of Admission:23/06/2022 | Date Of Discharge:25/06/2022 | Total Amount Claimed:50000
Hospital State:Others | State:S17 | Other Hospital Name:MEDICOVER HOSPITALS,VISAKHAPATNAM
Hospital Distric:KGH DOWN ROAD,JAGADAMBA JUNCTION,VISAKHAPATNAM

Declaration

I hereby declare that the statement in the application is true to the best of my knowledge and belief and that the person from whom medical expenses were incurred is a member of my family as defined under the Government servant Medical attendance rules 1972 and wholly dependent upon me.

Signature of HOD/DDO with Office Seal
MANDAL EDUCATIONAL OFFICER GANTYADA (MANDAL)

Signature of Govt.Servant/Pensioner

మెడికల్ బిల్లుపై చేసిన ఫోర్జరీ సంతకం

వివాదాల శంకర్ గిరి

- 2008లో పెదవేమలి స్కూల్‌లో పని చేస్తున్నప్పుడు సుమారు 45 రోజులు ఒడి అని చెప్పి స్కూల్‌కు గైర్హాజరయ్యారు. అప్పటి డిఇఒ దీనిపై ఆయనకు మెమో ఇచ్చారు.
- కొద్ది నెలల క్రితం జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో విజయనగరంలో ఇండిపెండెంట్ అభ్యర్థికి బాహాటంగా సహకరించి, ఫొటోస్‌లో దొరికిపోవడంతో స్థానిక వైసిపి నాయకుడు పూర్తి ఆధారాలతో కలెక్టర్, డిఇఒలకు ఫిర్యాదు చేశారు. విచారణ కమిటీ వేసి తప్పిదాన్ని గుర్తించి మెమో ఇచ్చారు.
- తరువాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సిరిపురం గ్రామంలో ఒక వర్గానికి సహకరించ దానికి డబ్బు తీసుకుని కొద్దిమందికి ఆ డబ్బును తన ఫోన్ ద్వారా బదిలీ చేశారు. ఈ విషయమై అప్పట్లో ఎంపిడిఒకు ఫిర్యాదులు అందాయి.
- తాజాగా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదులో ఒక పార్టీ నుంచి డబ్బులు ఒప్పందం చేసుకుని రూం, కంప్యూటర్స్, ఇద్దరు యువకులను ఏర్పాటు చేసుకుని నమోదు భారీగా చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మెమో ఇచ్చాం

మెడికల్ బిల్లుపై నాలుగు సంతకాలు నావి ఉండాలి. మూడు సంతకాలు నావి ఉన్నాయి. ఒక సంతకం మాత్రం ఫోర్జరీ చేసి ఉండటం వాస్తవం. దీంతో శంకర్ గిరి నాయుడుకు మెమో జారీ చేశాం.

-విజయలక్ష్మి, గంట్యాడ ఎంఇఒ

భీమా ఇవ్వని పశు బీమా!

నేటికీ అందని నష్టపరిహారం • ఆవేదనలో పాడి రైతులు

నెల కాదు, రెండు నెలలు కాదు.. దాదాపు 24 నెలలుగా పశు బీమా చెల్లించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోంది. ఎంతో ఆర్భాటంగా ఉచిత పశుబీమా పథకం ప్రారంభించి, పాడి రైతులకు మేలు చేస్తున్నట్లు ప్రకటించిన సర్కారు.. అమల్లో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. మృతిచెందిన పశువులకు సంబంధించి పాడి రైతులకు రెండేళ్లుగా నష్టపరిహారం చెల్లించకపోవడమే అందుకు నిదర్శనం. పశుబీమాకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే అందుకు కారణంగా తెలుస్తోంది. దీంతో పాడి రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-దత్తిరాజేరు



పాడి పశువులు చనిపోతే కలిగే నష్టం నుంచి పశువుల పెంపకందారులకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మూడేళ్ల క్రితం ఉచిత బీమా పథకానికి శ్రీకారం చుట్టింది. పాడి సంపద అభివృద్ధి చెంది తద్వారా పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనేది ప్రభుత్వం లక్ష్యం. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో పాడి పెంపకందారుల ఆధార్ కార్డు గుర్తింపుతో పశువుల చెవికి ట్యాగ్ వేసి ఉంచిత బీమా కోసం నమోదు చేశారు. బీమా చేశాక దేశవాళీ పశువు చనిపోతే రూ.15 వేలు, సంకరజాతి పశువుకు రూ.30 వేలు, సన్నమూగ జీవాలు మూడు అంతకంటే ఎక్కువ చనిపోతే ఒక్కో దానికి రూ.6 వేలు చొప్పున నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లాలో 3.86 లక్షల పశు వులకు, 4.80 లక్షల గొర్రెలు, 2.20 లక్షల మేకలను గుర్తించి, బీమా లబ్ధి పొందేలా నమోదు చేశారు. పథకం అమలు చేసిన మొదటి సంవత్సరంలో చనిపోయిన పశు వులకు నష్టపరిహారం అందించారు. అనంతరం రెండేళ్లలో వేల పశువులు మరణించినా రైతులకు పరిహారం అందివ్వలేదు. దీంతో పశుపోషణే జీవనాధారమైన ఎంతోమంది నిరుపేద రైతుల జీవనం కష్టతరమైంది.

గతంలో హెరిటేజ్ డెయిరీ, విశాఖ డెయిరీ వంటి సంస్థల యాజమాన్యాలు ఇన్స్యూరెన్స్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకునేవి. కొంతమొత్తం ప్రీమియం రైతులు చెల్లించగా, మరికొంత ప్రీమియం డెయిరీ యాజమాన్యం చెల్లించి ఆయా పాల సేకరణ కేంద్రాల పరిధిలో పాడి రైతుల పశువులకు బీమా నమోదు చేసేవి. చనిపోయిన పశువులకు బీమా నష్టపరిహారాన్ని రైతులకు చెల్లించేవారు. దీంతో రైతులకు కొంత పశువుల పెంపకం నిర్వహణపై కొంత భారం అయ్యేది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఉచిత పశు బీమా పథకాన్ని ప్రారంభించి రైతులకు మేలు చేకూర్చిందని జిల్లాలోనే పాడి రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ ఆనందం ఎన్నాళ్లో నిలవలేదని ముణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిందని జిల్లాలోని పాడి రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ బీమా పథకంతో లబ్ధి చేకూరుతుందన్న ఆశతో బీమా కంపెనీల ద్వారా ఇన్స్యూరెన్స్ చేసుకోలేకపోయామని, ప్రభుత్వం చనిపోయిన పశువులకు నష్టపరిహారం అందించక నష్టపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా పశు బీమా నష్టపరిహారం కోసం ఎదురు చూస్తున్న పాడి రైతులకు అదిగో.. ఇదిగో వస్తుందని పశువైద్యాధికారులు మాట దాటవేస్తున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో బీమా పరిహారం చెల్లింపుల్లో జాప్యం ఏర్పడిందని మరి కొంతమంది వైద్యాధికారులు చెప్పలేక చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి బీమా పరిహారం చెల్లించి, పాడి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

నిధులు విడుదలైన వెంటనే..

ఈ విషయమై జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి వైవి రమణను వివరణ కోరగా, గత మూడేళ్లలో జిల్లాలో సుమారు 6,500 పాడి పశువులు మృతి చెందినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1800 పశువులకు నష్టపరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు వివరించారు. మరో 4700 పశువులకు నష్టపరిహారంగా సుమారు 6 కోట్ల వరకు పాడి రైతులకు చెల్లించాల్సి ఉందని చెప్పారు. త్వరలో బడ్జెట్ విడుదలైన వెంటనే వారి ఖాతాలకు జమ చేస్తామని వెల్లడించారు.



చెరకు క్రషింగ్ ప్రారంభిస్తున్న ఇఐడి ప్యారీ అసోసియేట్ ఉపాధ్యక్షులు నాగ శేషారెడ్డి

చెరకు క్రషింగ్ ప్రారంభం

ప్రజాశక్తి-రేగిడి

మండలంలోని సంకిలి ఇఐడి ప్యారి సుగర్స్‌లో గురువారం ఉదయం 11 గంటలకు చెరకు క్రషింగ్ ప్రారంభమైంది. ఆ సంస్థ అసోసియేట్ ఉపాధ్యక్షులు ఎ.నాగశేషారెడ్డి క్రషింగ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈఏడాది 5.85లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ చేయాలని లక్ష్యంగా తీసుకున్నామన్నారు. చెరకు రైతులు నాణ్యమైన చెరకును సరఫరా చేసి సహకరించాలని కోరారు.. ఇప్పటికే చెరకు టన్ను మద్దతు ధర రూ.2,980 ప్రకటించామన్నారు. ఈ ఏడాది 5,500 ఎకరాల మొక్క తోటలు, 8,350 ఎకరాలు మమ్ము తోటల పంటలకు సంబంధించి చెరకు క్రషింగ్ 5 లక్షల 85 వేలమెట్రిక్ టన్నులు ఆడేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రైతులు పెట్టుబడిని దృష్టిలో ఉంచుకొని భారీ రాయితీలు ప్రకటించామన్నారు. 2022 అక్టోబర్ 1 నుంచి 2023 ఏప్రిల్ 30వరకు మామూలు పద్ధతిలో చెరకు నాటిన రైతులకు ఎకరానికి రూ.7వేలు, అదనంగా మరో వెయ్యి రూపాయలు కలుపుకొని రూ.8 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి రాయితీ పొందేందుకు ఎకరానికి 29 టన్నులు చెరకు సరఫరా చేయాలన్నారు.. ప్రత్యేక రాయితీలో భాగంగా 25 టన్నుల చెరుకు సరఫరా చేసిన రైతులకు 2024 జనవరి 16 నుంచి 2024 ఫిబ్రవరి 28 వరకు టన్ను ఒక్కింటికి అదనంగా రూ.75 చెల్లిస్తామని అన్నారు. 2024 ఏప్రిల్ ఒకటి నుంచి క్రషింగ్ పూర్తయ్యే వరకు చెరకు సరఫరా చేసే రైతులకు రూ.175 అదనంగా రాయితీలు ఇస్తామన్నారు. రానున్న చెరకు క్రషింగ్‌కు అధిక విస్తరణలో చెరకు పంటలు పండించి, దిగుబడులు సాధించి, ఫ్యాక్టరీ అభివృద్ధికి రైతులు తోడ్పడి సహకరించాలని కోరారు.. వీరితో పాటు సుగర్ కేన్ జిఎం రమేష్ కుమార్ రెడ్డి, ఎజిఎం కేన్ కిల్లి అప్పారావు, ఫైనాన్షియల్ ఎన్. సింహాద్రి ఉన్నారు.


ఎస్.కోటకే 80 శాతం నిధులు

విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ

ప్రజాశక్తి-లక్కవరపుకోట

శృంగవరపుకోట నియోజకవర్గ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతిస్తున్నానని, అందుకోసం ఎమ్‌పి నిధుల నుంచి 80 శాతం కేటాయిస్తున్నానని విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ అన్నారు. మల్లివీడు పంచాయతీ శివారు కొత్తపాలెం గ్రామంలో ఎమ్‌పి నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను సర్పంచ్ ఆదిరెడ్డి అర్జున్ ఆధ్వర్యాన ఎమ్‌పి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న ప్రతి మండలానికి తన నిధుల నుంచి కళ్యాణ మండపాలు నిర్మిస్తానని హామీనిచ్చారు. గడపగడపకు కార్యక్రమంలో వస్తున్న సమస్యల పరిష్కారానికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. టిడిపి, జనసేన పార్టీ నాయకుల మాటలను ప్రజలు నమ్మరన్నారు. అనంతరం గనివాడ పంచాయతీ శివారులో రూ.25 లక్షలతో తలపెట్టిన కమ్యూనిటీ భవన నిర్మాణానికి సర్పంచ్ రవ్వ శంకరరావు సమక్షంలో ఎమ్‌పి శంకుస్థాపన చేశారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామనాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపిపి ఆవాల శ్యామల, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైసిపి నాయకులు కొట్యాడ మహేష్, గేదెల నరసింహనాయుడు, కృష్ణప్ప, కూరాకుల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


కమ్యూనిటీ హాల్, ఓవర్ హెడ్ ట్యాంకుకు శంకుస్థాపన



కొత్తవలస.. మాట్లాడుతున్న విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ

కొత్తవలస : ప్రజల సమస్యలు పరిష్కరించడానికి తమ ప్రభుత్వం ముందుంటుందని విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ అన్నారు. మండలంలో దెందేరు పంచాయతీలో కమ్యూనిటీ హాల్, ఓవర్ హెడ్ ట్యాంకు పనులకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కమ్యూనిటీ హాల్ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, డిసిసిబి చైర్మన్ వేచలపు చినరామునాయుడు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, వేపాడ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, వైస్ ఎంపిపి కర్రి శ్రీనివాసరావు, ఎంపిటిసి వెలగల వెంకటరమణ, దెందేరు సర్పంచ్ విరోతి వెంకట రమణ, జామి ఈశ్వరరావు, యువజన విభాగం మండల అధ్యక్షులు ఐతంశెట్టి అనిల్ కుమార్, ఎంపిడిఒ వై.పద్మజ, పిఆర్ డిఇ వెంకట నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు, ఎఇ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు, సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - వంగర

రాజాం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్. రామ్మూర్తి నాయుడు డిమాండ్ చేశారు. రాజాంలో ఆస్పత్రి వద్ద గురువారం జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనం రూ.18వేలు అమలు చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదని, శానిటేషన్ కార్మికులకు ఇతర రంగాల్లో ఇస్తున్న కనీస వేతనాన్ని ఇక్కడ ఎందుకు అమలు చేయడం లేదని, వీళ్ల శానిటేషన్ కార్మికులు కాదా అని ప్రశ్నించారు. మరో పక్క హాస్పిటల్లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు ప్రభుత్వం ఇస్తున్నటువంటి వేతనాన్ని కూడా కాంట్రాక్టర్లు ఇక్కడ అమలు చేయడం లేదన్నారు. 60 సంవత్సరాలు నిండిన వారిని నిర్ధాక్షణంగా ఎటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్‌లు ఇవ్వకుండా తొలగిస్తున్నారన్నారు. సమస్యలు పరిష్కారం కోసం దశల వారీ పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు లక్ష్మీ, జ్యోతి, మరియమ్మ, పుష్ప, రాణి, అప్పారావు, పాల్గొన్నారు.

20న పక్కిలో క్రీడాకారుల ఎంపిక

బొబ్బిలి : డిసెంబర్ 19, 20న జరిగే జగనన్న క్రీడా సంబరాలు పోటీలకు ఈ నెల 20న పక్కిలో క్రీడాకారుల ఎంపిక చేపడుతున్నట్లు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం జగనన్న క్రీడా సంబరాలను నిర్వహిస్తుందన్నారు. నియోజకవర్గ, జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తుందని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మొదట, ద్వితీయ, తృతీయ, నాలుగో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు నగదు బహుమతి, షీల్డ్‌ను ముఖ్యమంత్రి జగన్ డిసెంబర్ 21న అందిస్తారని తెలిపారు. ఈ నెల 20న పక్కిలో వాలీబాల్, కబడ్డీ జట్ల ఎంపిక కోసం పోటీలు జరుగుతాయని, బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కౌన్సిలర్ పాలవలస ఉమ, వైసిపి నాయకులు బొమ్మి అప్పలనాయుడు, సిహెచ్ రాజగోపాల్ పాల్గొన్నారు.

19 నుండి ఫ్రీ రేషన్

మెరకముడిదాం : ఈ నెల 19 నుంచి రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఉచిత బియ్యం మండలంలో డిపోల వద్ద పంపిణీ చేయనున్నట్లు సిఎస్ డిటి పిన్నింటి రామారావు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన డీలర్ల సమావేశంలో తహశీల్దార్ రత్నకుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కార్డుదారులకు ఏవిధమైన ఆటంకమూ లేకుండా ఉచిత బియ్యం సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో డీలర్ల సంఘం మండల అధ్యక్షులు సుంకరి జయసింహం నాయుడు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ టవర్ బ్యాటరీలు మాయం

గుర్ల : మండలంలోని తెట్టంగి గ్రామంలో ఉన్న బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ దగ్గర ఉన్న 48 బ్యాటిరీలు దొంగ తనానికి గురయ్యాయి. దీంతో నాలుగు రోజుల నుంచి సిగ్నెల్స్ పూర్తి స్థాయిలో అందడం లేదని స్థానికులు చెబుతున్నారు. గరివిడి బిఎస్ఎన్ఎల్ అధికారులు జిల్లాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం గుర్ల పోలీసులు పరిశీలించారు. అపహరణకు గురైన బ్యాటరీలు విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. బ్యాటరీలు శనివారం అపహరించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. సంబంధిత శాఖ సిబ్బంది బ్యాటరీలను మారుస్తున్నారనుకొని ఎవరూ పట్టించు కోలేదని మరికొంత మంది చెబుతున్నారని అధికారులు తెలిపారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

జ్యూట్‌మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమి

నోటీసు పెట్టిన రెవెన్యూ అధికారులు ● కొనుగోలు చేసిన వ్యాపారుల్లో ఆందోళన



శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలం

ప్రజాశక్తి-బొబ్బిలి

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని యాజమాన్యం బొబ్బిలికి చెందిన వ్యాపారులకు విక్రయించింది. కానీ జ్యూట్ మిల్లు స్థలంలో 28 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి అక్రమిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అక్కడ వారం క్రితం నోటీసులు పెట్టారు. దీంతో జ్యూట్‌మిల్లు స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

బొబ్బిలి పట్టణంలో హుగ్లీ జ్యూట్ మిల్లును రాజాంకు చెందిన కెవిఆర్ కొనుగోలు చేశారు. జ్యూట్ మిల్లులో సుమారు మూడు వేల మంది కార్మికులు పనిచేస్తూ జీవనోపాధి పొందేవారు. 2014లో జ్యూట్ మిల్లు మూత పడింది. వైసిపి అధికారంలోకి వస్తే జ్యూట్ మిల్లును తెరిపిస్తామని 2019 ఎన్నికల్లో ఆ పార్టీ నేతలు హామీ ఇచ్చినా తెరవలేదు. అనంతరం జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేశారు. జ్యూట్ మిల్లు స్థలం సుమారు 7.50 ఎకరాలు ఉండగా రూ.33 కోట్లకు విక్రయించారు. రెండు విడతలలో జ్యూట్‌మిల్లు స్థలాన్ని వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేశారు. ఏడున్నర ఎకరాల్లో సర్వే నెంబర్ 68/1లో 28 సెంట్లు ప్రభుత్వ భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించి నోటీసు పెట్టడంతో జ్యూట్ మిల్లు స్థలాన్ని కొనుగోలు చేసిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

పిఎఫ్ బకాయి రూ.1.60కోట్లు

జ్యూట్ మిల్లులో పని చేసిన కొత్త కార్మికులు 1300 మందికి యాజమాన్యం పిఎఫ్ బకాయి రూ.1.60 కోట్లు చెల్లించాల్సి ఉన్నా చెల్లించలేదు. దీంతో కార్మికులకు పిఎఫ్ పెన్షన్ రావడం లేదు. పిఎఫ్ పెన్షన్ బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులకు పింఛను రావడం లేదు. పిఎఫ్ బకాయి చెల్లించకపోతే జ్యూట్ మిల్లు స్థలం వద్దకు కార్మికులు వచ్చి ఆందోళన చేస్తారేమోనని వ్యాపారులు భయపడుతున్నారు.

అదనంగా రూ.10 కోట్లు ఇచ్చిన వ్యాపారులు..?

జ్యూట్ మిల్లు స్థలాన్ని వ్యాపారులు రూ.33 కోట్లకు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ చేయడంలో జాప్యం జరగడంతో యజమానికి రూ.2 కోట్లు తగ్గించి రూ.31 కోట్లు చెల్లించేందుకు ఒప్పందం జరిగినట్లు తెలిసింది. జ్యూట్‌మిల్లు యాజమాన్యం జిఎస్‌టి చెల్లించకపోవడంతో సంబంధిత అధికారులు కొంత స్థలాన్ని స్వాధీనం చేసుకుని వేలం వేశారు. ఆ స్థలాన్ని కెవిఆర్ సమీప బంధువు వేలంలో దక్కించుకున్నట్లు తెలిసింది. వేలంలో దక్కించుకున్న స్థలం వ్యాపారులకు ఇవ్వాలంటే అదనంగా రూ.10 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఇచ్చినట్లు చర్చ సాగుతోంది. మొదటి విడతలో మూడున్నర ఎకరాలు రిజిస్ట్రేషన్ అవ్వగా, రెండో విడతలో మరో మూడు ఎకరాల భూమి తాత్కాలిక పద్ధతిలో రిజిస్ట్రేషన్ జరిగినట్లు తెలిసింది. వ్యాపారులు జ్యూట్ మిల్లు యాజమాన్యానికి పూర్తిగా డబ్బులు చెల్లించినా భూమి మాత్రం పూర్తిగా అప్పగించనట్లు సమాచారం.

28 సెంట్లు ప్రభుత్వ భూమి గుర్తింపు

జ్యూట్ మిల్లు స్థలంలో 28 సెంట్లు ప్రభుత్వ భూమిని గుర్తించినట్లు తహశీల్దార్ ఎన్.రాజారావు చెప్పారు. ఇప్పటికే మిల్లు వద్ద నోటీసు పెట్టామన్నారు. జ్యూట్ మిల్లు స్థలంలో ప్రభుత్వ భూమి సరిహద్దులను గుర్తించేందుకు సర్వే చేస్తామని మల్లమ్మపేట విఆర్ఒ శ్రీనివాసరావు తెలిపారు.

వినియోగదారులకు చేరువలో ఆర్‌టిసి పార్శిల్ సేవలు

ప్రజాశక్తి-బొబ్బిలి

వినియోగదారులకు చేరువలో ఆర్‌టిసి పార్శిల్ సేవలు అందిస్తున్నామని ఆర్‌టిసి అసిస్టెంట్ ట్రాన్స్‌ఫోర్ట్ మేనేజర్ హెచ్.దివ్య అన్నారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్‌లో పార్శిల్ సర్వీస్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినియోగదారుల నుంచి ఆర్‌టిసి యాజమాన్యం నిర్ణయించిన రుసుం ప్రకారం వసూలు చేయాలన్నారు. వినియోగదారులను బాగా రిసీవ్ చేసుకోవాలన్నారు. అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్శిల్ సర్వీస్ ఏజెంట్‌కు పలు సూచనలు చేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రజాశక్తి- గరివిడి

మండలంలోని రేగటి అగ్రహారం గ్రామ సచివాలయం పరిధిలోని విపి రేగ గ్రామ పంచాయతీ పరిధిలోని విజయరాంపురంలో 10 శాలలు, ఒక ఇల్లు ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోయిన సంగతి తెలిసిందే. దీనికి స్పందించిన ఎంపిపి మీసాల విశ్వేశ్వరరావు, విజయలక్ష్మి, జెడ్‌పిటిసి వాకాడ శ్రీను, వైస్ ఎంపిపి రామకృష్ణ రాజు బాధితులను గురువారం పరామర్శించారు. అనంతరం బాధితులు ఒక్కొక్కరికి రూ. 1500 చొప్పున 11 కుటుంబాలకు రూ.16,500 అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కొనిసి కృష్ణంనాయుడు, రేగటి ఎంపిటిసి కడుముల రాంబాబు, నాయకులు యడ్ల అప్పారావు, వలిరెడ్డి లక్ష్మణ, ఈశ్వరరావు పాసి రాము, అలమండ అప్పలనాయుడు, మన్యాల అంకులు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఇబి సిఐ జైభీమ్‌ను సత్కరిస్తున్న న్యాయవాదులు

సిఐ జైభీమ్‌కు సత్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఇటీవల రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించిన ఎస్ఇబి సిఐ జైభీమ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం పట్టణంలోని న్యాయవాదులు బిఎస్ఆర్ మూర్తి, తుమరాడ గంగాధర్, గుర్రల కృష్ణ, మదర్ థెరిస్సా ట్రస్టు అధ్యక్షులు క్లైవ్.. సిఐను సత్కరించారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-వంగర

సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. ఈ మేరకు మండలంలోని మడ్డువలస సచివాలయాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు అనంతరం మాట్లాడుతూ సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సన్యాసినాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కెఎనాయుడు, తదితరులు

మాజీ సర్పంచ్‌కు నివాళి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలో పెదమానాపురం మాజీ సర్పంచ్ చుక్క సన్యాసినాయుడు ఈనెల 7న మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతికి గురువారం గ్రామంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద ఆయన కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కెఎ నాయుడు, మాజీ వైస్ ఎంపిపి పెద్దింటి మోహన్ రావు, బొండపల్లి జెడ్‌పిటిసి మాజీసభ్యులు బండారు బాలాజీ, సీనియర్ నాయకులు పివివి గోపాల రాజు, పలు గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, పెదమానాపురం సర్పంచ్ గొటివాడ దాసు, గ్రామ పెద్దలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

హెచ్ఐవిపై అవగాహన

ప్రజాశక్తి- గరివిడి

మండలంలో వెదుళ్ల వలస గ్రామంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా హెచ్ఐవిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవి ఎలా వస్తుంది? ఎలా వ్యాపిస్తుందో వీధి నాటకం ద్వారా తెలియజేశారు. హెచ్ఐవి ఎయిడ్స్ రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో, వ్యాధి సోకినవారి పట్ల వివక్షత చిన్న చూపు చూడకుండా ఎలా సమాజంలో జీవించాలో వివరించారు. హెచ్ఐవి ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గురించి, సుఖ వ్యాధులు చికిత్స, కండోమ్ ఉపయోగం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుడివాడ తమ్మి నాయుడు, ఏఎంసి డైరెక్టర్ బార్ణల సూర్యనారాయణ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మేలు రకం విత్తనాలను వాడాలి

ప్రజాశక్తి-వంగర

మేలు రకాలైన విత్తనాలను వాడటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని శాస్త్రవేత్తలు శ్రీనివాస్, రాజశేఖర్, స్వాతి అన్నారు. కొప్పర వలస రైతు భరోసా కేంద్రంలో రైతులకు పెసర, మినుము గోగు పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెసర, మినుము విత్తనాలు వాడేటప్పుడు మేలైన రకాలైన ఎల్ బి జి 787, ఐపిఎం 2-14 రకాలను వాడుకుంటే తెగుళ్ల నివారించడంతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. గోగు పంటపై అధునాతన పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సువర్ణ కొప్పరవలస, బంగారు వలస, కొండ చాకరాపల్లి గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సక్రమంగా మెనూ అమలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ జి. గిరిబాల సూచించారు. గురువారం ఆమె అలుగోలు ఉన్నత పాఠశాలను సందర్శించి ఎండిఎంను తనిఖీ చేసి విద్యార్థులతో పాటు భోజనం చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు, హెచ్ఎం నల్లా జగదీశ్వర రావు, పంచాయితీ కార్యదర్శ కెల్ల రాంజీరావు, సిఆర్‌పి బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో మంచి గుర్తింపు

ప్రజాశక్తి-బొబ్బిలి

సామాజిక సేవతో మంచి గుర్తింపు వస్తుందని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామ్మూర్తి అన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమావేశం గురువారం బొబ్బిలి తాలూకా అధ్యక్షులు కర్రి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో ఉండాలని కోరారు. ఒకరికొకరు సహాయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రౌతు రామ్మూర్తి

క్రీడా పోటీలు ప్రారంభం



కొత్తవలస.. కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలసలోని జిందాల్ భారతి విద్యామందిర్‌లో నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడా పోటీలను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. అండర్-14, 17 బాలికల పోటీలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. మొత్తం 8 క్రీడాంశాల్లో ఎంపికలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు, జిందాల్ స్కూల్ ప్రిన్సిపల్ విశ్వనాథ్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.క్రిష్ణంరాజు, ఎంఇఒ శ్రీదేవి, ఎల్.కోట ఎంఇఒ కూర్మారావు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

మెరకముడిదాం : ఈ నెల 14,15వ తేదీలలో గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన నియోజక వర్గస్థాయి క్రీడా ఎంపికలలో మండలంలోని బైరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతి కనబరిచ్చినట్లు ప్రధానోపాధ్యాయులు ఎస్ఎస్ఆర్ ఆచార్యులు తెలిపారు. త్రోబాల్ అండర్ -17 విభాగంలో వి. జయంతి, అండర్ -14లో పి. దినేష్, టి. గిరిజ, చెస్ అండర్ -17లో ఎస్. చంద్ర శేఖర్ విజయం సాధించారన్నారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులకు ఆయనతో పాటు పీడీ జె. రామారావు అభినందనలు తెలిపారు.



కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ ఉమాపరమేశ్వరి

చెరువు పనుల పరిశీలన

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెదతాడివాడ గ్రామానికి చెందిన చుక్కవానివాని చెరువులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ ఉపాధి పనులను పూర్తి స్థాయిలో ప్రారంభించాలన్నారు. రెండు పూటలా కొలతలు ప్రకారం పనిచేస్తు కూలీ గిట్టుబాటవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ వెంకటరమణ, ఇసి రమణ, టెక్నికల్ అసిస్టెంట్ సునీత, ఎఫ్ఎ రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు ఆదా ఎక్కడ ..?

ప్రజాశక్తి- రేగిడి

స్థానిక మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరం తో పాటు ఎంపిడిఒ గదిలో గురువారం అధికారులు, ప్రజాప్రతినిధుల ఎవ్వరు లేకపోయినా ఫ్యాన్లు, లైట్లు, వీడియో కాన్ఫరెన్స్ వెలిగి ఉండడంతో విద్యుత్ ఆదా లేదా అని పలువురు విమర్శిస్తున్నారు. వాస్తవంగా ఈ కార్యాలయానికి అవసరానికి మాత్రమే విద్యుత్తు వాడేలే తప్ప. అనవసరంగా ఎవరూ లేని సమయంలో విద్యుత్తు వాడడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యాలయానికి వేలల్లో కరెంట్ బిల్లు వస్తుందని వృధా వ్యయాన్ని అరికట్టి, విద్యుత్ ఆదా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎవరూ లేకున్నా కొనసాగుతున్న వీడియో కాన్ఫరెన్స్



సిఐటియు జెండాను ఎగురవేస్తున్న రెడ్డి శంకరరావు

హక్కుల కోసం ఐక్య ఉద్యమం

ప్రజాశక్తి-గంట్యాడ

కార్మిక హక్కులను కాపాడకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రెడ్డి శంకరరావు కోరారు. గురువారం కొండతామరపల్లి జంక్షన్‌లో సిఐటియు జెండావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల పోరాడి సాధించుకున్న అనేక హక్కులను కేంద్ర ప్రభుత్వం హరిస్తోందని ఆగ్రహించారు. రోడ్డు భద్రత చట్టం అమల్లోకి రావడం వల్ల ఆటో కార్మికులకు తీవ్ర నష్టమని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఆటో కార్మికులు సిఐటియులో చేరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు విజయనగరం నగర అధ్యక్ష, కార్యదర్శి బి.రమణ, సురేష్, ఉపాధ్యక్షులు జగన్మోహన్, ఆటో యూనియన్ నాయకులు అప్పారావు, వెంకటరావు పాల్గొన్నారు.

సర్పంచ్ అసమర్థతతో కుంటుపడిన అభివృద్ధి

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని రెల్లివలస గ్రామాభివృద్ధి సర్పంచ్ అసమర్థత వల్లే కుంటుపడుతుందని వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు ఆరోపించారు. గ్రామంలో ఎక్కడా ప్రభుత్వ స్థలం లేక పోవడంతో మురుగు స్థలం మట్టితో కప్పి సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేపడితే తమపై అట్రాసిటీ కేసులు పెట్టించారన్నారు. రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేస్తుంటే ఎన్ఆర్ఆజిఎస్ ద్వారా విడుదలైన బిల్లులను ఇవ్వడానికి నిరాకరిస్తున్నారన్నారు. పని చేస్తున్న వాటికి కమీషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తుంటే ఎలా నిర్మాణం చేయగలమన్నారు. రెల్లివలసలో ముఖ్యంగా అత్యవసరమైన మరుగుదొడ్ల నిర్మాణం చేయాలని ప్రయత్నిస్తే అక్కడ మాజీ సర్పంచ్ వద్దంటూ అడ్డు పడ్డారన్నారు. ఇప్పటికైనా మూడు సెంట్లు స్థలం కొని మరుగుదొడ్ల నిర్మాణం చేద్దామంటే అక్కడున్న ధరకైనా స్థలం ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రెల్లివలసకు ఏం చేసామో తాము చూపిస్తామని, మీరు 40 సంవత్సరాలలో ఏమీ చేసారో చూపించాలని డిమాండ్ చేశారు. 'రెల్లివలస అభివృద్ధికి మీరు అడ్డుపడుతున్నారా..? మేము అడ్డుపడుతున్నామో గ్రామంలో చర్చకు మీరు సిద్ధమేనా' అని ప్రశ్నించారు. అభివృద్ధిపై చర్చిండానికి మీరు ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తామని, మీరు రావడానికి సిద్ధమైతే రేపే గ్రామ పెద్దలు, మీడియా సమక్షంలో కూర్చొని చర్చించుకుందామా అని సవాల్ విసిరారు. తప్పుడు ఆరోపణలు చేసి ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం మానుకోవాలని హితువు పలికారు. ఈ సమావేశంలో ఆయనతో పాటు వైస్ ఎంపిపి ఎన్. సత్యనారాయణ రాజు, వైసిపి నాయకులు పుప్పాల లక్ష్మినారాయణ, మహంతి శ్రీనువాసరావు, సర్పంచులు టొంపల సీతారాం, కొత్తకోట శ్రీరాములు తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలు



విజయనగరంకోట.. డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గ్రంథాలయాలు విద్యార్థులకు విజ్ఞాన దీపికలుగా నిలుస్తాయని జిల్లా గ్రంథాలయ సేవాసమితి అధ్యక్షులు ఎస్ఎస్ఎస్ఎస్ రాజు తెలిపారు. ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా హెచ్ఎం బి.లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చలం, పేరినాయుడు, సకీనా, అప్పారావు, రమేష్, లావణ్య శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

విజయనగరం కోట : చిత్రలేఖనం పోటీలు విద్యార్థులలో సజనాత్మక కళను పెంపొందిస్తాయని జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత అన్నారు. గురువారం స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్యదర్శి లలిత మాట్లాడుతూ ఈ పోటీలలో విద్యార్థులకు జాతీయ నాయకుల చిత్రపటాలు, పర్యావరణ చిత్రపటాలు ఇచ్చామన్నారు. విజేతలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపులో సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.శ్రీనివాసరావు, ఇతర గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీలతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి

వక్తృత్వ పోటీల ద్వారా విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరుగుతుందని పలువురు పేర్కొన్నారు. గాజులరేగ శాఖ గ్రంథాలయంలో నిర్వహించిన పోటీల్లో జిల్లా పరిషత్ హైస్కూల్, నారాయణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక నారాయణ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వేపాడు హైస్కూల్ ఉపాధ్యాయులు శివప్రసాద్, లైబ్రేరియన్ ఎస్.సోమునాయుడు పాల్గొన్నారు.

గుర్ల : స్థానిక శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు సందర్భంగా గురువారం క్విజ్ పోటీలను గ్రంథాలయ అధికారి పి. రామారావు నిర్వహించారు. ఈ పోటీలను గుర్ల నాయకులు ఇజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, మాజీ ఎంపిటిసి కిలారి సూర్యనారాయణ ప్రారంభించారు. గుర్ల జెడ్‌పిహెచ్, కెజిబివి పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఇఒ భానుప్రకాశ్ మాట్లడుతూ విద్యార్థుల ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కల్యాణి, ఫకీరు కిట్టలి ఎంపిటిసి బి. జోగి నాయుడు, గ్రంథాలయ సేవ సంఘం నాయకులు దాసరి ఈశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట.. మాట్లాడుతున్న ఎస్ఎస్ఎస్ఎస్ రాజు

డెంకాడ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం. ఆదినారాయణ, గ్రంథాలయ నిర్వాహుకులు ఎం. మోహన్‌రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

'చిట్టి గురువులు'పై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

చిట్టి గురువులు కార్యక్రమంపై గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ బాలాజీ ప్రసాద్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య డిప్యూటి డైరెక్టర్ కోట్ల సుగుణాకర రావు పాల్గొని మాట్లాడారు. నిరక్షరాస్యులను 45 రోజుల్లోగా సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలని సూచించారు. అన్ని వర్గాల వారూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సచివాలయం సంక్షేమ, డాటా ప్రోసెసింగ్, ఎడ్యుకేషన్ కార్యదర్శులు, మండల లిటరసీ అధికారి ఆల్తి మురళీ కృష్ణ, మెప్మా సిఎంఎం డి.గోవింద రావు, సిఒబి పోలినాయుడు, జరజాపుపేట జెడ్‌పి ఉన్నత జడ్పి పాఠశాల హెచ్.ఎం సి.హెచ్. రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న ఎపి ఆదర్శ పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనాన్ని ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు పరిశీలించారు. మెనూ సక్రమంగా అమలు చేస్తున్నదీ, లేనిదీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏవైనా లోపాలుంటే తన దృష్టికి తేవాలని సూచించారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బికెనాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల వసతిగృహంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ తెలిపారు. రెండు రోజులుగా తాగునీటి సమస్య తలెత్తిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం వసతిగృహాన్ని సందర్శించారు. ముందుగా విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మరమ్మతుకు గురైన తాగునీటి మోటారును పరిశీలించారు. మరమ్మతులకు నిధులున్నాయా? లేవా? అని ప్రిన్సిపల్ యు.ఉషారాణిని ఆయన ప్రశ్నించగా, ప్రస్తుతం నిధులు లేక రిపేర్ చేయలేదని ఆమె తెలిపారు. మోటారు మరమ్మతుకు, కొత్త మోటారు ఏర్పాటుకు అవసరమైన నిధులకు అంచనా వేసి, దరఖాస్తు చేస్తే, చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ సూర్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీదేవి పాల్గొన్నారు.



పాడైన మోటారును పరిశీలిస్తున్న ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్

కస్తూరి కుటుంబానికి ఎమ్‌పి, ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపురం గ్రామానికి చెందిన ఎఎంసి చైర్‌పర్సన్ మూకల కస్తూరి కుటుంబాన్ని గురువారం విశాఖ ఎమ్‌పి ఎంవివి సత్యనారాయణ, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పరామర్శించారు. కస్తూరి భర్త, వైసిపి సీనియర్ నాయకులు మూకల సత్యనారాయణ ఈ నెల 10న అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని వారు పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, కూరాకుల సూర్యారావు, మెరపల సత్యనారాయణ, వేచలపు రామ్మూర్తి నాయుడు, నాయకులు పాల్గొన్నారు.



మూకల కస్తూరి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్‌పి సత్యనారాయణ, ఎమ్మెల్యే శ్రీనివాసరావు